క్లుప్తంగా

నేటి నుంచి కోదండ రాముని బ్రహ్మోత్సవాలు

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధి సీతానగరంలో ఉన్న శ్రీ సీతాసమేత కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సీతారామస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవం, అన్నదానం, గురువారం సాయంత్రం కృష్ణానదిలో తెప్పోత్సం నిర్వహించనున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

విజ్ఞాన భారతి రాష్ట్ర కార్యదర్శిగా ఆచార్య సుబ్రహ్మణ్యం



తాడేపల్లిరూరల్ : విజ్ఞాన భారతి ఆంధ్రప్రదేశ్ విభాగ శాఖ భారతీయ విజ్ఞాన మండలి ఏడవ సర్వసభ్య సమావేశంలో వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ప్రిన్సిపల్ ఆచార్య కె. సుబ్రహ్మణ్యంను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు యూనివర్శిటీ వీసీ డాక్టర్ పార్థసారథివర్మ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆచార్య కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతీయ మూలాలను సమాజానికి పరిచయం చేసే దిశగా భారతీయ విజ్ఞాన మండలి చేస్తున్న కార్యక్రమాలకు తనవంతు కృషి చేస్తానన్నారు. అధ్యక్షులు రమేష్, ఇతర సభ్యులతో కలసి పనిచేస్తానన్నారు. ఆచార్య సుబ్రహ్మణ్యంను వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు ఏవీఎస్ ప్రసాద్, ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, యూనివర్శిటీ ఆచార్యులు తదితరులు అభినందించారు.

పోలేరమ్మ ఆలయంలో ఎమ్మెల్యే సుచరిత పూజలు



తాడికొండ: మండలంలోని దామరపల్లి గ్రామంలో వేంచేసియున్న పోతురాజు- పోలేరమ్మ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల పొంగళ్ళు సందర్భంగా గ్రామస్తుల ఆహ్వానం మేరకు పూజల్లో పాల్గొన్న ఆమె, ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తాడికొండ, మేడికొండూరు జెడ్పీటీసీలు గుడిమెట్ల జ్యోతి, కందుల సిద్ధయ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, మండల పార్టీ అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వర రెడ్డి పలువురు వైఎస్సార్ సీపీ పాల్గొన్నారు.

16న 'అనితరుడు' పుస్తక పరిచయ సభ

తెనాలి : పట్టణానికి చెందిన సమతా ఆర్ట్స్ థియేటర్-ప్రజ్వలిత సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16న తెలుగు నాటకరంగ దినోత్సవం నిర్వహించనున్నారు. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమయ్యే వేడుకల్లో తొలుత ఖమ్మం జిల్లాకు చెందిన కవి, రచయిత మొవ్వా శ్రీనివాసరావు కవితాంతరంగ విశ్లేషణలు ఎట్ 366పై రూపొందించిన 'అనితరుడు' పుస్తకం పరిచయ సభ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 'భిన్నస్వరాలు' జుగాష్‌విలి అధ్యక్షతన జరిగే సభలో కనపర్తి బాబూరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, అంబటి మురళీకృష్ణ, గరికపాటి శ్రీనివాసరావు మాట్లాడతారు. మొవ్వా శ్రీనివాసరావు స్పందన తెలియచేస్తారు. అనంతరం 'ముట్టడి' ప్రకాష్ రచన 'మానవ రాజ్యంలో' అనే సాంఘిక నాటికను ఆయన దర్శకత్వంలోనే ప్రదర్శిస్తారు. సమతా ఆర్ట్స్ థియేటర్ 45వ వార్షికోత్సవం సందర్భంగా ముట్టడి నాటకం ప్రదర్శించిన నటీనటులు, సాంకేతిక నిపుణులను ఇదే వేదికపై సత్కరిస్తారు.సభకు ముందు ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య బృందంచే నృత్యప్రదర్శనలు ఉంటాయని వివరించారు.

అగ్ని ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

తెనాలి రూరల్: అగ్ని ప్రమాదాలను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కె. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కొత్తపేటలోని అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాల సమయంలో నివారించేందుకు విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు నివాళి అర్పించారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు పలు సూచనలు చేశారు. అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్ ద్వారా ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ నెల 20 వరకు జరిగే వారోత్సవాల్లో భాగంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

- రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి
- ఘన నివాళులర్పించిన ప్రజా ప్రతినిధులు, సంఘాలు



ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ హనుమంతరావు, లావణ్య

మంగళగిరి: సమ సమాజం కోసం నిరంతరం శ్రమించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తెలిపారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా కొత్త బస్టాండు సెంటరులోని అంబేడ్కరు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, నేతలు పచ్చల రత్నకుమారి, దొడ్డక శివపార్వతి, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, గోలి కస్తూరి, రేఖా వకుళాదేవి, ఈపూరి ఆదామ్, శావతి థామస్, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, సాలి ప్రశాంత్, దొడ్డకకృష్ణ, కురగంటి ఆదామ్, అంజి, మలక్‌బాబు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ బాధ్యత అందరిదీ

తాడేపల్లిరూరల్ : బీజేపీ నుంచి భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీఎం మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్న శివశంకరరావు అన్నారు. ఆదివారం గుండిమెడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి సీపీఎం మండల కార్యదర్శి దొంగిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు పల్లె కృష్ణ, గుండిమెడ, బత్తుల సంసోను, గుడివాడ సామ్యవాదం, జె.నాగరాజు, సాంబయ్య, దాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్

ఫిరంగిపురం: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ జయంతిని పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ కత్తిరేణమ్మ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. ముందుగా సొలన బస్టాండు సెంటర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పి.జేమ్స్ ఇన్నయ్య, బి.శ్రీనివాస రెడ్డి. డి.మెల్కియా, జి. కోటేశ్వరరావు, జి.చంద్రం, బి.అంజిరెడ్డి, హేమలతా రెడ్డి, పాలపాటి రఘు, సీహెచ్ రామమోహన్‌రెడ్డి, ఎస్.లక్ష్మి, చంద్రశేఖరరెడ్డి, ఎస్. చిన్నప్ప, ఎస్.నాగరాజు, ఖాజావలి, మస్తాన్‌వలి, మీరావలి, ఆర్.రంజన్‌బాబు, వి.రాము, టి.కృష్ణ, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో సీఐ వీరేంద్ర బాబు, ఎస్ఐ వీరనారాయణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రైటర్ దాసు, గంగరాజు, ఏఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.



అంబేడ్కర్, పూలే చిత్రపటాలకు సీపీఎం నేతల నివాళి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ కత్తిరేణమ్మ, నాయకులు

వాడవాడలా అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ, తాడేపల్లి పట్టణ, రూరల్, దుగ్గిరాల మండలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అంబేడ్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుంటూరు జిల్లా జేసీఎస్ కో-ఆర్డినేటర్ డేవిడ్ రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రకాష్, తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నాయకులు జీలగ పెదగాలయ్య, మేక వెంకటరామిరెడ్డి, మేడ వెంకటేశ్వరరావు, జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

- పెనుమాక గ్రామంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొక్క ప్రసన్నకుమార్, పెనుమాక పార్టీ అధ్యక్షుడు మేకా దామేశ్వర్ రెడ్డి, పులి భుజంగరావు, అన్నూరి ప్రభాకర్ అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.
- ఉండవల్లి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అనిల్, నాయకులు కళ్ళం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు దంటు గోవర్ధనరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ సీపీ నాయకులు పాల్గొన్నారు.
- కుంచనపల్లి, ప్రాతూరు, చిర్రావూరుల్లో వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు అమరానాగయ్య, మిరియాల రాంబాబు, పాటిబండ్ల కృష్ణమూర్తి, మరియబాబు, డేవిడ్ నామతోటి కోటేశ్వరరావు, మేకా సాంబశివరావు, బాజీ గంగాధర్, గొడవర్తి శ్రీనివాసరావు, కత్తిక మల్లికార్జునరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.
- దుగ్గిరాల మండలంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేతకోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు శృంగారపాటి రత్నం, నాయకులు వడ్డేశ్వరపు రజనీకాంత్, సర్పంచ్‌లు బాణావత్ ఖుషీబాయి, కొరితల పద్మావతి, ఉన్నం ఝాన్సీరాణి, యార్లగడ్డ శ్రీచంద్ర దుర్గాభవాని, ఇత్తడి రమేష్ బాబు, దాసరి సుందరమ్మ, కొండూరు సుధారాణి, పలుకూరి మేరమ్మ, షేక్ అజీజున్, బి. శ్రీనివాసరెడ్డి, గంపల గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ రూపవాణి, జెడ్పీటీసీ అరుణ తదితరులు

ప్రపంచ మేధావి అంబేడ్కర్

తాడికొండ: ప్రపంచం గర్వించదగిన మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ దంపతులు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని గుంటూరులోని తమ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించిన అనంతరం రక్తదానం, అన్నదాన శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా దేశ విదేశాలలో ప్రపంచ జ్ఞాన దినోత్సవంగా జరుపుకుంటున్నారన్నారు. అనేక సామాజిక రుగ్మతలు, అంటరానితనం, అస్పృశ్యత విలయతాండవం చేస్తున్న రోజుల్లో విద్య అనే ఆయుధం ద్వారా దానిని జయించి భారత రాజ్యాంగం రచన ద్వారా దేశానికి స్వేచ్ఛా సమానత్వం అందించిన మహోన్నత త్యాగశీలి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– తాడికొండ బస్టాండ్ కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, జయభారత్ కాలనీ, బడేపురంలోని అంబేడ్కర్ విగ్రహాలకు సర్పంచ్ తోకల సరోజినీ పాల్గొని విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ షేక్ నగీనా, డైరెక్టర్ నల్లిబోయిన శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, ఎంపీటీసీలు ధూళిపాళ్ల నాగేశ్వరరావు, వివిధ విభాగాల నాయకులు బెజ్జం సాయి ప్రసాద్, ఉండవల్లి నరసింహారావు, తోకల కిరణ్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, దయాసాగర్ నివాళి



తాడికొండ బస్టాండ్ కూడలిలో అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి నాయకుల నివాళి

సీఎం వైఎస్ జగన్‌పై దాడి హేయం



సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్ రాజు



నిరసన తెలుపుతున్న ఫిరంగపురం నేతలు



పేరేచర్ల రోడ్డుపై వైఎస్సార్ సీపీ నాయకుల నిరసన

ఫిరంగిపురం: మేమంత సిద్ధం బస్సు యాత్రలో భాగంగా విజయవాడలో సీఎం వైఎస్ జగన్‌పై రాయితో దాడికి ప్రయత్నించడం దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఖండించారు. మండల కేంద్రంలో ఆదివారం ఉదయం దాడిని నిరసిస్తూ.. ర్యాలీ నిర్వహించారు. నిందుతలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐ వీరేంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, పాలపాటి రఘు, బి.శ్రీనివాస రెడ్డి, బి.అంజిరెడ్డి, పిచ్చిరెడ్డి, రామమోహన్‌రెడ్డి, డి.చంద్రం, డి.మెల్కియా, చిన్నప్ప ఖాజావలి, హేమలతారెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై దాడి హేయం

తాడేపల్లిరూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి హేయమని, వైఎస్సార్ సీపీ జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్ రాజు ఖండించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ పరిపాలనలో ఎంతోమంది బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పులు వచ్చాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం అందిస్తున్నారని అన్నారు. ఆయనకున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాల నాయకులు దొంగదెబ్బ తీసేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళగిరి నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ప్రత్యక్షంగా తలబడే దమ్ములేక పిరికిపందల్లా వెనుక నుండి దాడి చేశారని, ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య, గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ ముదిగొండ ప్రకాష్ పాల్గొన్నారు.

మేడికొండూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాళ్ల దాడి చేయడం అమానుష చర్యని జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మనవ రాజేష్ అన్నారు. జగన్‌పై దాడికి నిరసనగా మేడికొండూరు మండల పరిధిలోని పేరేచర్ల గ్రామంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కో లేక ఈ విధంగా దాడికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాగుల్ షరీఫ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధన సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యం

బాపట్ల ఎంపీ నందిగం సురేష్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ సురేష్

తాడికొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా తుళ్ళూరు మండలం ఉద్దండరాయునిపాలెంలోని తన నివాసంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాల చీడల నుంచి దేశాన్ని కాపాడేందుకు రాజ్యాంగం రచించిన అంబేడ్కర్ ఆ ఫలాలను ప్రతి ఒక్కరికీ సమానంగా అందించేందుకు వేసిన బాటలు నేడు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ఆచరణలో పెడుతున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.. నేడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాలలో పెద్దపీట వేసి అందిస్తున్న పాలన చిరస్మరణీయమన్నారు.

పవన్ అభిమానినే చితకబాదిన జనసైనికులు



దాడికి గురైన దిలీప్‌నాయుడు

తెనాలి రూరల్ : జనసేన అధినే పవన్‌కళ్యాణ్ పర్యటనలో జన సైనికులు అత్యుత్సాహం ప్రదర్శించారు. పవన్ అభిమాని అయిన ఓ కాపు యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పవన్ కళ్యాణ్‌పై రాళ్లు విసిరాడని పుకారు చెలరేగడంతో అతనిపై విచక్షణారహితంగా దాడి చేశారు. బాధితుడు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పొన్నూరు మండలం మామిళ్లపల్లికి చెందిన సరిగిరి దిలీప్‌నాయుడు తెనాలిలో ఆదివారం సాయంత్రం జరిగిన పవన్‌కళ్యాణ్ రోడ్ షో, బహిరంగ సభలో పాల్గొనేందుకు వచ్చాడు. ఇక్కడి సుల్తానాబాద్‌లోని హెలీప్యాడ్ నుండి పవన్ కళ్యాణ్ కొంత దూరం కారు నుండి అభిమానులకు అభివాదం చేస్తూ వచ్చి వారాహి వాహనంలోకి మారారు. ఈ మార్గంలోనే ఉషోదయ కళ్యాణమండపం వద్ద దిలీప్ పవన్ రాక కోసం వేచి ఉన్నాడు. పవన్ కళ్యాణ్ అటుగా వెళ్లగానే ఓ యువతితో దిలీప్ అసభ్యంగా ప్రవర్తించాడంటూ ఆమె తండ్రి అతనిపై దాడి చేశాడు. పక్కనే ఉన్న జన సైనికులు కలుగజేసుకుని దాడి చేస్తుండడంతో సమీపంలోని చెట్టు ఎక్కాడు. అయినా జనసైనికులు కిందకు లాగడంతో తనను రక్షించుకునేందుకు అందుబాటులో ఉన్న రాయి తీసుకున్నాడు. రాళ్లతో దాడి చేస్తున్నాడని జనసైనికులు కేకలు వేయడంతో అక్కడే ఉన్న మరికొందరు పవన్ కళ్యాణ్‌పై రాళ్లు వేశాడని కేకలు మొదలు పెట్టారు. యువకులు పెద్ద ఎత్తున గుమికూడి దిలీప్‌పై దాడి చేస్తున్న క్రమంలో కల్యాణమండపం ఆవరణలోకి పరుగెత్తాడు. వెంబడించిన జనసైనికులు అతనిపై విచక్షణారహితంగా దాడి చేశారు. కళ్యాణ మండపం సమీపంలోనే విధుల్లో ఉన్న గుంటూరు స్పెషల్‌బ్రాంచి ఇన్‌స్పెక్టర్ ఎస్ వెంకట్రావు, మరో మహిళా ఎస్ఐ, తెనాలి రూరల్, త్రీ టౌన్ స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుళ్లు శివ, తిరుమలరావు, ఇతర సిబ్బంది హుటాహుటిన దాడి జరిగిన ప్రదేశానికి వెళ్లారు. బాధితుడు దిలీప్‌ను పోలీసులు చుట్టుముట్టి అతని ప్రాణాలను రక్షించారు. పవన్ కళ్యాణ్ అభిమానినైన నేను ఆయనపై రాళ్లు ఎందుకు వేస్తానంటూ బాధితుడు వాపోయాడు. ప్రస్తుతం అతను పోలీసుల అదుపులో ఉన్నాడు. వివాదానికి కారణమేంటన్నదీ విచారిస్తున్నారు.

చరిత్ర ఉన్నంతకాలం అంబేడ్కర్ పేరు శాశ్వతం

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్



అంబేడ్కర్ చిత్రపటానికి విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ కూర్మనాథ్ నివాళి

తాడేపల్లిరూరల్ : చరిత్ర ఉన్నంతకాలం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ పేరు శాశ్వతంగా ఉంటుందని, అంబేడ్కర్ మనందరివాడని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ అన్నారు. ఆదివారం తాడేపల్లి బైపాస్ రోడ్‌లో గల రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ న్యాయవాదిగా, ఆర్థిక వేత్తగా, రాజకీయ వేత్తగా, సామాజిక కార్యకర్తగా, రాజ్యాంగ నిర్మాతగా ఆయన పేరు చరిత్ర ఉన్నంత కాలం పదిలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సి.నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గిరాల గ్రామంలో మండల బీజేపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షులు పసుపులేటి గణేష్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొంగర జోగేంద్ర ప్రసాద్, అమ్మినేని సిద్ధయ్యనాయుడు, తాడిబోయిన శ్రీధర్, అత్తిలి సాంబశివరావు, అడపా వెంకటరావు, కోనంకి కృష్ణ, గడ్డం శేషగిరి, హనుమా నాయక్, బాలాజీ నాయక్, నిడుమోలు సత్యనారాయణ, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే శక్తులను శిక్షించాలి

తెనాలి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నమని జై గౌడ్ ఉద్యమం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబొమ్మ కిషోర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అరాచక శక్తులు రాజకీయ నేతలకు ప్రత్యక్ష, పరోక్ష దాడులకు దిగటం సమంజసం కాదన్నారు. పార్టీలు ఏవైనా శాంతియుత రాజకీయ వాతావరణం కల్పించేలా సహకరించాలని అభిప్రాయపడ్డారు. ఎన్నికల వాతావరణాన్ని చెడగొట్టి, ప్రజల్ని భయభ్రాంతులను చేస్తూ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే శక్తులను కఠినంగా శిక్షించాలని కిషోర్‌గౌడ్ ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తిచేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. యాదవబజార్‌కు చెందిన దూళ్ల ప్రభాకర్ (40) పది రోజుల కిందట పాత కక్షల నేపథ్యంలో పోగుల రాంబాబుతో గొడవపడ్డాడు. ఈ సమయంలో రాంబాబు అతడ్ని కొట్టి గాయపరిచాడు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ప్రభాకర్ ఇంటికి వచ్చాడు. తిరిగి అస్వస్థతకు గురవ్వడంతో జీజీహెచ్‌లో చేరాడు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

కీళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయొద్దు

గుంటూరు మెడికల్: కీళ్ల నొప్పులను అశ్రద్ధ చేయకుండా తొలిదశలోనే నిపుణులైన వైద్యుల్ని సంప్రదిస్తే తీవ్రతను తగ్గించవచ్చని, కీళ్ల మార్పిడి అవసరాన్ని చాలా వరకు నిరోధించవచ్చని ప్రత్యూష రుమటాలజీ కేర్ వ్యవస్థాపకులు డాక్టర్ ప్రత్యూష రాజవరపు తెలిపారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఆదివారం ఉదయం నిర్వహించిన అవగాహన సభ, ఉచిత వైద్య సలహా శిబిరంలో డాక్టర్ ప్రత్యూష పాల్గొని ప్రసంగించారు. సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ టి. సేవకుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ కీళ్లనొప్పుల గల కారణాలలో రుమటాయిడ్ ఆర్థరైటిస్ అంటే కీళ్ల వాతం, ఆస్టియో ఆర్థరైటిస్, గౌట్, ఆస్టియో పోరోసిస్ వంటివి పేర్కొనదగినవి తెలిపారు. రక్తంలో పెరిగిన యూరిక్ యాసిడ్ గౌట్ కు కారణమవుతుందని తెలిపారు. సభాధ్యక్షులు డాక్టర్ తాతా సేవకుమార్ మాట్లాడుతూ వ్యాధుల విషయంలో ప్రజలు శాస్త్రీయ అవగాహనతో మెలగాలని తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి, చైర్మన్ పావులూరి రమేష్, సభ్యులు సీహెచ్.సత్యనారాయణ, విశ్రాంత గ్రంథాలయ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థ పరిరక్షణకు పాటుపడాలి



వెంకటరెడ్డి, వెంకట సుబ్బారెడ్డికి సత్కారం

నగరంపాలెం: న్యాయ వ్యవస్థ పరిరక్షణకు న్యాయవాదులంతా పాటుపడాలని వక్తలు పేర్కొన్నారు. ఇటీవల గుంటూరు బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కాసు వెంకటరెడ్డి, జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది (జీపీ)గా నియమితులైన మార్రెళ్ల వెంకటసుబ్బారెడ్డిలను రెడ్డి జనాభ్యుదయ మండలి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. న్యాయమైన తీర్పులు వెలువరించడానికి, న్యాయవ్యవస్థ ప్రక్రియను నిర్వహించేందుకు తోడ్పాటు అందించాలని వక్తలు కోరారు. సభకు మండలి అధ్యక్షుడు అంజిరెడ్డి అధ్యక్షత వహించగా, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, మాజీ అధ్యక్షులు పోలూరి వెంకటరెడ్డి, పలువురు న్యాయవాదులు, మండలి సభ్యులు పాల్గొన్నారు.